క్లుప్తంగా

ఘనంగా లలితా సుందరేశ్వరుల కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవరసిద్ధి వినాయక లలితాసుందరేశ్వర శక్తి పీఠంలో బుధవారం లోకకల్యాణార్థం శ్రీలలితా సుందరేశ్వరులల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణాన్ని వీక్షించి, తరించారు. అనంతరం సాయంత్రం శ్రీవరసిద్ధి వినాయకునికి ఫల రసాలతో అభిషేకార్చన చేశారు. శ్రీచక్రార్చన, చండీ హోమం, నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళహారతితో బుధవారం కార్యక్రమాలు ముగిశాయి. గురువారం శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి అభిషేకం, హోమం చేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు కాండూరి లక్ష్మణస్వామి తెలిపారు.

జూలో ఆట పరికరాల ఏర్పాటు


జూలో ఏర్పాటు చేసిన ఆట పరికరాల వద్ద పిల్లల సందడి


ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కుకు వెళ్లే పిల్లలు వన్యప్రాణుల సందర్శనతో పాటు ఎంచక్కా ఆటలాడుకోవచ్చు కూడా. ఇక్కడ వందల సంఖ్యలో వన్యప్రాణులున్నాయి. వాటిని తిలకించడంతో పాటు సరదాగా ఆడుకోవడం కోసం ఇటీవల జూ అధికారులు ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. జూలో నీటి ఏనుగుల కొలను ఎదురుగా క్యాంటీన్ పక్కన ఖాళీ స్థలంలో ఊయల, జారుడు బల్లలు, తేగుడు బల్ల తదితర ఆట పరికరాలు ఏర్పాటు చేశారు. వాటి వద్ద పిల్లల సందడి ఎక్కువగా ఉంటోంది.

16వ వార్డులో అన్నదానం


అన్నదానం చేస్తున్న ఎంపీ ఎంవీవీ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ముగింపోత్సవాలు సందర్భంగా బుధవారం జీవీఎంసీ 16వ వార్డు అంబేడ్కర్ కాలనీలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీ, వైఎస్సార్‌సీపీ విశాఖ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు శ్రీనివాసరెడ్డి, పార్టీ వార్డు అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఇప్పిలి పార్వతి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


రాము మృతదేహం

మత్రిపాలెం: కంచరపాలెం ఫిఫ్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురం చాకలిగెడ్డ ప్రాంతంలో నివసిసున్న డి.రాము(55) గతంలో తాపీమేస్త్రిగా పనిచేసేవాడు. రెండేళ్ల నుంచి పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. అతడికి మద్యం తాగే అలవాటు ఉంది. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి భార్య డి.లక్ష్మి ఉదయం 10 గంటల ప్రాంతంలో బయటకు వెళ్లి తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి గదిలో ఫ్యానుకు తాడుతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహం కేసు దర్యాప్తు చేపట్టారు.

పేదలకు సంజీవిని..
జగనన్న ఆరోగ్య సురక్ష


ఆరోగ్య సురక్ష కరపత్రాలు చూపుతున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, తదితరులు


13వ వార్డు యూపీహెచ్‌సీలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యుడు

ఏయూ క్యాంపస్: పేద ప్రజల ఆరోగ్య సంజీవనిగా జగనన్న ఆరోగ్య సురక్ష నిలుస్తోందని 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి అన్నారు. బుధవారం 20వ వార్డు శివాజీపాలెం 157 సచివాలయం పరిధిలోని నౌకానగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్లో ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 157 సచివాలయం పరిధిలోని ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, వ్యవసాయ మార్కెటింగ్ వైస్ చైర్‌పర్సన్ యువతా రెడ్డి, ముమ్వల సురేష్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్, సీవో రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉరుకూటి మురళి, కిల్లాన రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

571 మందికి పరీక్షలు

ఆరిలోవ: జీవీఎంసీ 11, 13 వార్డుల పరిధి యూపీహెచ్‌సీలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. ఆయా శిబిరాలలో 571 మందికి వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు అందజేశారు. 11వ వార్డు బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో జరిగిన శిబిరంలో వైద్యులు, సిబ్బంది 321 మందికి వైద్య సేవలు అందించారు.
జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆరిలోవ ఆఖరి బస్‌స్టాప్ వద్ద ఉన్న యూపీహెచ్‌సీలో 250 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. బాలాజీనగర్ యూపీహెచ్‌సీలో జరిగిన శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ కిరణ్ లలితాదేవి, ఆరిలోవ కాలనీ యూపీహెచ్‌సీలో జరిగిన శిబిరాన్ని వైద్యాధికారి డాక్టర్ సుమన్ పర్యవేక్షించారు.

దుర్గమ్మ సన్నిధిలో ఎంపీ ఎంవీవీ


దుర్గమ్మను దర్శించుకున్న ఎంపీ ఎంవీవీ

బీచ్ రోడ్డు: చినవాల్తేరు రెల్లివీధిలో ఉన్న విజయ దుర్గా అమ్మవారి ఆలయాన్ని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ బుధవారం సందర్శించారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దుర్గమ్మ సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బద్రునిషా, మహ్మద్ గౌస్, మధుపాడ రవికుమార్, నిర్వాహకుడు చిన్నా తిరుమలరావు, తదితరులు పాల్గొన్నారు.
నూకరాజు కుటుంబానికి పరామర్శ
ఎంవీపీ కాలనీ: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన జీవీఎంసీ 19వ వార్డు పెదజాలరిపేటకు చెందిన బడే నూకరాజు కుటుంబాన్ని బుధవారం ఎంపీ ఎంవీవీ పరామర్శించారు. స్థానిక నాయకులతో కలిసి కుటుంబ సభ్యులు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ లక్ష్మి, పార్టీ నాయకుడు సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో తనిఖీలు


శివాజీపాలెంలో రేషన్ డీలర్ గొడౌన్ తనిఖీ చేస్తున్న పౌర సరఫరా శాఖ అధికారులు

మద్దిలపాలెం : రేషన్ షాపుల్లో పౌర సరఫరాల శాఖాధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జీవీఎంసీ 22వ వార్డు శివాజీపాలెంలోని రేషన్ దుకాణం–0387204లో తనిఖీలు చేశారు. ఈ దుకాణంలో 45 పంచదార ప్యాకెట్లు, 2 గోధుమ పిండి ప్యాకెట్లు వ్యత్యాసం ఉన్నట్టు గుర్తించామని సర్కిల్–2 చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు అశోక్ తెలిపారు. ఈ మేరకు షాపు డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్, భారతి, మురళీ, రామకృష్ణ పాల్గొన్నారు.
ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ పరిధిలోని 0387200 నంబర్ రేషన్ షాపులో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం చేపట్టిన ఈ తనిఖీల్లో 100 కేజీల పీడీఎస్ బియ్యం, 7 పంచదార బస్తాల్లో తూకంలో వ్యత్యాసాలను అధికారులు గుర్తించారు. దీంతో అవకతవకలను ప్రశ్నించడంతో పాటు ఆ షాపు డీలర్‌పై 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీతమ్మధార డీటీ త్రినాథ్, సర్కిల్ –2 చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు రమేష్, భారతి, మురళి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చి మొక్కల్లో పార్కు!


విశాలాక్షినగర్‌లో నిర్మాణం మధ్యలో నిలిచిన పార్కు, లోపల పిచ్చి మొక్కలు

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్‌లో చేపట్టిన పార్కు నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కోఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులో సీతకొండ అంచున విశాలాక్షినగర్ సంఘం భవనం ఎదురుగా సుమారు ఎకరన్నర స్థలంలో జీవీఎంసీ అధికారులు సుమారు రూ.కోటి నిధులతో పార్కు నిర్మాణం చేపట్టారు. దీని కోసం ఏడాదిన్నర క్రితం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. కొద్ది రోజుల పాటు స్థలం చుట్టూ గోడలు, లోపల అడుగు ఎత్తులో పునాదులు నిర్మించారు. అనంతరం మిగిలిన పనులు చేయకుండా వదిలేశారు. దీంతో ఈ స్థలం ప్రస్తుతతం పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఇందులో పిల్లలు ఆడుకోవడానికి వివిధ ఆట పరికరాలు ఏర్పాటు, వృద్ధులు సేదదీరడానికి బెంచీలు, నడక కోసం పాత్ వేలు నిర్మించాల్సి ఉంది. అధికారులు దీనిపై దృష్టిపెట్టి పనులు పూర్తి చేయించి, పార్కును వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో దేవీ అనుపు మహోత్సవం


కోలాటం నృత్యాల నడుమ దుర్గాదేవి అనుపు ఉత్సవం

మద్దిలపాలెం : శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కనకదుర్గా అమ్మవారి అనుపు మహోత్సవం బుధవారం మంగాపురం కాలనీలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేడుకల్లో మహిళలు సంప్రదాయ కోలాటం నృత్యాలతో సందడి చేశారు. అనంతరం వార్డులోని పలు ప్రాంతాలలో అమ్మవారి ఊరేగింపు కనుల పండువగా నిర్వహించారు. ఆర్కే బీచ్ వరకూ ఈ ఉత్సవం సాగింది. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 22వ వార్డు అధ్యక్షుడు, ఏపీ పోలీస్ హౌసింగ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

15న చలో విజయవాడ


చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రక్షణకు నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని సీపీఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు అన్నారు. ఈ మేరకు పోస్టర్‌ను బుధవారం పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను టీడీపీ, జనసేన, వైఎస్సార్‌సీపీ, బీజేపీలు పక్కదారి పట్టిస్తున్నాయన్నారు. దీనిపై ప్రజా రక్షణ భేరిలో భాగంగా నవంబర్ 1న నుంచి రాష్ట్రంలో మూడు ప్రాంతాలలో బస్సు యాత్ర నిర్వహించనున్నామన్నారు. ఈ యాత్ర నవంబర్ 3న విశాఖపట్నం, పెందుర్తి జంక్షన్‌కు చేరుకుంటుందన్నారు. 4న ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం, పూర్ణామార్కెట్, శ్రీహరిపురం, గాజువాక, కూర్మన్నపాలెంలో బస్సు యాత్రలు చేరుకుని, సభలు జరుగుతాయన్నారు. 15న విజయవాడలో ప్రజారక్షణ భేరి సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్కే ఎస్వీకుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత సారంపై ప్రవచనం



ప్రవచిస్తున్న ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య దత్తాత్రేయ శాస్త్రి

సీతంపేట: కంచికామకోటి శంకరమఠం, గీతా ప్రచార సమితి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం శ్రీమద్ భగవద్గీత సారంపై శంకరమఠం ప్రాంగణంలో ప్రవచనం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి, ఆచార్య మద్దులపల్లి దత్తాత్రేయ శాస్త్రి భగవద్గీత సారంపై ప్రవచనం చేసి దాని విశిష్టతను తెలియజేశారు. ప్రతి ఒక్కరూ గీతా సారాంశాన్ని తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతా ప్రచార సమితి అధ్యక్షుడు చావలి విశ్వేశ్వరరావు, పలు ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


అంజలి(ఫైల్)

బీచ్ రోడ్డు: మూడో పట్టణ పరిధిలో ఓ యువతీ అదృశ్యమైనట్టు కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రామ్‌నగర్ లయన్స్ క్లబ్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్న చిత్తరపు అంజలి(24) ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఎప్పటిలాగే ఈ నెల 19వ తేదీ ఉదయం ఆఫీసుకు ఆమె బయలుదేరింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీశారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యులు మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంజలితో కలిసి పని చేస్తున్న దేవేంద్రరెడ్డి అని వ్యక్తిపై అనుమానం ఉన్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన సీఐ రామారావు విచారణ ప్రారంభించారు.

అలరించిన కథా కచేరీ


కథానిక చదువుతున్న అయ్యలసోమయాజుల ప్రసాద్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన కథా కచేరి అలరించింది. కథకుల స్వీయ కథా పఠనం, వైవిధ్యంతో నిండిన కథలు అందరినీ ఆలోచింపజేశాయి. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ తెలుగు కథకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లని, కథల్లో వివిధ రకాలను వివరించారు. డాక్టర్ కె.జి.వేణు విశిష్ట కథా పరిచయం శీర్షికలో రచయిత ఈతకోట సుబ్బారావు కథానిక ప్రాణం ఖరీదును చక్కగా విశ్లేషించారు. అనంతరం జరిగిన కథా కచేరీలో భాగవతుల సత్యనారాయణ మూర్తి కథానిక మానవత్వం ఖరీదు, కె.వి.ఎస్. మూర్తి కథానిక అనసూయమ్మ గారి ఆరోప్రాణం, అయ్యలసోమయాజుల ప్రసాద్ దమయంతమ్మ దసరా పండగ కథానిక, కుప్పిలి భీమేశ్వరరావు దిక్సూచి కథానిక, కొత్తూరి రమణ పెళ్లిపుస్తకం కథానికలు వివిధ అంశాలను స్పృజించి అలరించాయి. కార్యక్రమంలో సాహితీ విమర్శకుడు డి.వి.సూర్యారావు, కె.రాంప్రసాద్, వేదుల కామేశ్వరశర్మ, శ్రీనివాసరావు, రాధారాణి పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి కీలకం


రిలే నిరాహార దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక ప్రగతికి కార్మిక శక్తి అత్యంత కీలకమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. అటువంటి కార్మిక శక్తిని విస్మరించి, కేంద్ర ప్రభుత్వం తన ఇష్టానుసారం ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ పోవడం సరికాదన్నారు. కార్మికులను విస్మరించిన ఏ ప్రభుత్వం చరిత్రలో బాగు పడలేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 986వ రోజు బుధవారం స్టీల్‌ప్లాంట్ ఈఎస్ఎఫ్, ఈఆర్ఎస్, సేఫ్టీ, ఈఎండీ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు సంస్థను కాపాడుకునేందుకు ప్రజలు ఆందోళన చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

పెందుర్తి: మండలంలోని వాలిమెరక జుత్తాడలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందాడు. వివరాలు.. కోడి అచ్చిబాబు(45) భార్య రామలక్ష్మి, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. డ్రైవర్‌గా పనిచేస్తున్న అచ్చిబాబు మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం ఇద్దరికీ తీవ్రస్థాయిలో గొడవ జరిగింది. ఈ క్రమంలో అచ్చిబాబు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు గ్రామంలో గాలించారు. బుధవారం సాయంత్రం గ్రామానికి సమీపంలోని ఓ తోటలో అచ్చిబాబు విగతజీవిగా కనిపించాడు. వెంటనే గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో జరిగిన వివాదం కారణంగా అచ్చిబాబు ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

మొక్కల పెంపకం.. బృహత్తర కార్యం

- ఏయూలో సొంతంగా నర్సరీ అభివృద్ధి
- అంటుగట్టే విధానంలో మొక్కల వృద్ధి


మొక్కలకు అంటుకట్టిన తరువాత..


తీగజాతి, అలంకరణ మొక్కలు, ఆక్సిజన్ ప్లాంట్స్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో మొక్కల పెంపకంపై ఉద్యానవన సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించారు. వర్సిటీలోని పలు కార్యాలయాల వద్ద పెంచడానికి వీలుగా అలంకరణ, ఔషధ, తీగ జాతి మొక్కలు, సువాసన అందించే పుష్పాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. వర్సిటీలో మొక్కల పెంపకం, సంరక్షణకు ప్రత్యేకంగా విభాగం ఉంది. కొద్ది పాటి ఖర్చుతో ఈ విభాగం సిబ్బంది స్వయంగా నర్సరీని తలపించే విధంగా మొక్కల పెంపకం చేస్తున్నారు. దీనిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ స్వయంగా సందర్శించి సిబ్బందిని అభినందించారు.

వర్సిటీ అవసరాలకు తగినట్టుగా..

వర్సిటీలో అలంకరణకు అవసరమైన మొక్కలను పెంచాలని అధికారులు నిర్ణయించారు. దీనికి అవసరమైన కొద్దిపాటి ముడి వస్తువులను కొనుగోలు చేసి హార్టికల్చరల్ పార్క్‌లో విస్తృత స్థాయిలో మొక్కలను పెంచేలా పనులు వేగంగా చేస్తున్నారు.

ఆర్థిక భారం తగ్గుతోంది..

అలంకరణకు కొనుగోలు చేసే మొక్కలు రూ. 100 నుంచి రూ.500 వరకు ఉంటున్నాయి. తరచూ మొక్కలను కొనడం వర్సిటీకి ఆర్థికంగా భారంగా మారుతోంది. దీనిని తగ్గించడానికి, సొంతంగా వర్సిటీ నిర్వహణకు సిద్ధమైంది. గార్డెనింగ్ విభాగంలో అనుభవం కలిగిన ముగ్గురు వ్యక్తులు ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతూ ఈ మొక్కల పెంపకాన్ని నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా ప్లాస్టిక్ కవర్లు, సహజ ఎరువులు కొనుగోలు చేసి వీటిని అంటుకట్టడం, విత్తనాల నుంచి మొక్కలను ఉత్పత్తి చేయడం వంటి విధానాలలో మొక్కలను అభివృద్ధి చేస్తున్నారు. తులసి, షుగర్ ప్లాంట్, పనస, మామిడి వంటి మొక్కలతో పాటు బయట నర్సరీలలో లభించే పదుల సంఖ్యలో క్రోటన్స్ వంటి మొక్కలను ఇక్కడ ఎంతో సులభంగా అభివృద్ధి చేస్తున్నారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వహస్తాలతో అమ్మవారికి జలాభిషేకం చేశారు. అర్చకుడు శ్రీనివాస్ భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వ హించారు. ప్రతి బుధవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పసుపు నీళ్లతో అమ్మవారిని అభిషేకించడం ఆనవాయితీ అని ఆయన తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఈవో రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన..

ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్ర ఎరుకుమాంబ ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యా ఖ్యాతగా వ్యవహరించారు.

ఉల్లి కోసం బారులు


సీతమ్మధార రైతుబజారులో ఉల్లి కోసం క్యూకట్టిన వినియోగదారులు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజారులో బుధవారం కిలో ఉల్లిపాయలు రూ.46కు విక్రయించారు. కొద్ది రోజుల కిందట రూ.36గా ఉన్న ఉల్లి ధర ఒక్కసారిగా రూ.46కు పెరగడంతో వినియోగదారులు క్యూ కట్టారు. బజారులో రెండు కౌంటర్లు ఏర్పాటు చేశారు. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో ఉల్లి రూ.50కు విక్రయిస్తున్నారు. గురువారానికి కిలో ఉల్లి రూ.50కు పెరిగే అవకాశం ఉంది. రైతుబజారు ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పర్యవేక్షించారు.

అభాగ్యురాలికి సేవలు


అభాగ్యురాలికి తల వెంట్రుకలు కట్ చేస్తున్న సూరాడ అప్పారావు

డాబాగార్డెన్స్ : పాత నగరంలో గల స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఓ పిచ్చితల్లిని చేరదీశారు. ఆమె ఉదయం, మధ్యాహ్నం, రాత్రి భోజన సమయానికి సంస్థ వద్దకు రావడం.. భోజనం చేసి వెళ్లిపోవడం చేస్తోంది. ఆమె తలంతా కురుపులతో మానసికంగా బాధపడుతున్నట్టు గుర్తించిన ఆయన ఆమె జుట్టు కత్తిరించి సంస్థ మహిళలచే స్నానం చేయించి, ఆ తల పుండ్లకు మందు రాసి సేవలందించారు.